క్లుప్తంగా

తప్పిన ప్రమాదం



విద్యుత్ వైర్లను తాకుతూ ముందుకు వెళ్తున్న లారీ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మెయిన్ రోడ్డులో శనివారం ప్రమాదం తప్పింది. పార్వతీపురం వైపు కర్రల లోడుతో వెళ్తున్న లారీ అక్కడి విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు నేలరాలాయి తప్ప వైర్లు తెగిపడలేదు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, ఇలాంటి భారీ లారీలకు వైర్లు తగలకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న డాక్టర్ నాని

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పార్వతీపురానికి చెందిన వైద్యుడు పట్టా భాస్కర్‌ప్రసాద్‌నాయుడు(డాక్టర్ నాని) ఆర్థికసాయం చేశారు. రాజగోపురం సింహద్వారం నిర్మాణానికి రూ.150 లక్షల చెక్కును ఆలయ అభివృద్ధి ట్రస్టు సభ్యుడు శ్రీరామచంద్రమూర్తికి శనివారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వస్తుండడం చాలా సంతోషంగా ఉందని ఆలయ ట్రస్టు సభ్యుడు అన్నారు.

జల్లారలో కందికొత్తల పండగ



కందికొత్తల పండగలో గిరిజనుల సందడి

సీతంపేట: మండలంలోని జల్లార గ్రామంలో గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం కందికొత్తల పండగ శనివారం ఘనంగా నిర్వహించారు. కొండపోడులో సాగు చేసిన కంది, రాగులు, తదితర పంటలను ముందుగా గిరిజన దేవతలకు నైవేద్యంగా సమర్పించారు. కొత్త దుస్తులు ధరించి, మేళ తాళాలతో పూజలు చేశారు. గ్రామదేవత ప్రతిరూపంగా కొలిచే గొడ్డలమ్మ, చత్తరమ్మలను గ్రామంలో ఊరేగించారు. చిన్నా,పెద్ద అందరూ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు.

ఆరోగ్య తనిఖీలు



వృద్ధురాలి ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్యుడు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని దండుసూర గ్రామంలో రాపా ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎప్పటికప్పుడు తమ ఫౌండేషన్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీన్ కంటి మహంతి కోరారు.

స్నేహభావంతో కొనసాగాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై అనిల్‌కుమార్, టింగ అన్నాజీరావు, కిరణ్‌కుమార్

భామిని: క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని బత్తిలి ఎస్సై డి. అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు టింగ అన్నాజీరావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా బత్తిలిలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను జనసేన మండల శాఖ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వనాథ పట్నాయక్, నిమ్మల నిబ్బరం, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సాలూరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్‌ఐ నర్సింహమూర్తి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడి పందాలు, పేకాట, పొట్టేళ్ల పందాలు తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. అందరూ సంతోషంగా సంక్రాంతి జరుపుకోవాలని సూచించారు.

పాలకొండలో ట్రాఫిక్ కష్టాలు..

- రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రాకపోకలు
- రూపు కోల్పోతున్న ప్రధాన రహదారులు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

పాలకొండ రూరల్:

పాలకొండ పట్టణంలో ట్రాఫిక్ ఇక్కట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పాలకొండ – శ్రీకాకుళం, విశాఖ, వీరఘట్టం రహదారులు రూపు కోల్పోతున్నాయి. పట్టణంలో పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు వీడడం లేదు. ప్రధాన రహదారుల్లో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ స్తంభించిపోతుండడంతో పాటు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు స్థానిక వైఎస్సార్ కూడలి కుడి భాగంలో గల అంతర్రాష్ట రహదారిలో వీరఘట్టం వయా పార్వతీపురం మీదుగా ఒడిశా రాష్ట్రం నుంచి నిత్యం వందల సంఖ్యలో లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో సమస్య మరింత జటిలమైంది. ప్రస్తుత సీజన్‌లో చెరకు లోడుతో వచ్చే వాహనాలు మరో సమస్యగా మారాయి. ఆర్‌అండ్‌బీ అధికారుల లెక్కల ప్రకారం పట్టణంలో విస్తరించి ఉన్న ప్రధాన రహదారి 50 అడుగుల వెడల్పు ఉండాలి. ప్రస్తుతం రహదారికి ఇరువైపులా వ్యాపార సముదాయాలు వెలియడం, రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు, తోపుడు బళ్లతో పాటు సంక్రాంతి నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు ఏర్పాటు చేసిన స్టాళ్లతో ప్రధాన రోడ్డు కిక్కిరిసిపోయింది. 50 అడుగులు ఉండాల్సిన రోడ్డు వెడల్పు ప్రస్తుతం 20 నుంచి 25 అడుగుల మేర కుచించుకుపోయింది.



పాలకొండ-శ్రీకాకుళం రహదారిలో ట్రాఫిక్ దుస్థితి



పండగల నేపథ్యంలో స్థానిక ప్రధాన మార్కెట్‌లో రద్దీ ఇలా

తప్పని ఇక్కట్లు..

రహదారి వెడల్పు తగ్గిపోవడంతో ఒకే సమయంలో ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ఇక గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోవాల్సిందే. అలాగే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, లారీలు, బస్సులు, ట్రాక్టర్ల సంఖ్య పెరగడంతో అటు శ్రీకాకుళం, ఇటు విశాఖ, ఒడిశా వెళ్లే రహదారుల్లో ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలో కీలకమైన యాలాం కూడలి కూడా ట్రాఫిక్ వలయంలో చిక్కుకుపోయింది.

ప్రధాన మార్కెట్‌లో..

నగర పంచాయతీని ఆనుకుని ఉన్న ప్రధాన మార్కెట్‌లో ఇదే పరిస్థితి నెలకొంది. దాదాపు ఈ మార్కెట్‌లో 142 దుకాణాలున్నాయి. ఏటా వీటి ద్వారా రూ.14 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. అలాగే ఆశీల రూపంలో మరో రూ.5 లక్షల వరకు నగర పంచాయతీకి వస్తున్నట్లు అంచనా. అయినా ప్రధాన మార్కెట్‌లోకి ప్రవేశించాలంటే ప్రజలు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ ఉన్న రోడ్డుకిరువైపులా చిరు వ్యాపారులు చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పండగలు, పర్వదినాలల్లో మార్కెట్‌లోకి వెళ్లి సరుకులు కొనుగోలు చేయాలంటే పద్మ వ్యూహం చేదించాల్సిందే. ఇక్కడ పార్కింగ్ సౌకర్యంతో పాటు కనీస భద్రతా చర్యలు లేవు. దీనిపై అధికారులు స్పందించాలనిప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం..



ప్రధాన మార్కెట్‌లో లోపాలు సరిదిద్దడంతో పాటు ప్రజలు, వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతాం. పండగల నేపథ్యంలో చిరు వ్యాపారులకు ఇబ్బంది లేకుండా, ట్రాఫిక్ స్తంభించకుండా అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా నగర కార్యాలయం ఎదుగా ఉన్న స్థలం తాత్కాలిక పార్కింగ్‌కు కేటాయిస్తున్నాం. వినియోగదారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులతో చర్చించి సీసీ కెమెరాల ఏర్పాటును కూడా ప్రోత్సహిస్తున్నాం.

– సామంచి సర్వేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్, పాలకొండ

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు:



రహదారి ప్రమాదాలను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా భారీ వాహనాలు, చెరకు ట్రాక్టర్ల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలతో పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. వాహన చోదకులు, పలు రకాల వాహన డ్రైవర్లలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తాం.

– కె.ప్రయోగమూర్తి, ఎస్సై, పాలకొండ.

నేడు టీటీడీ ట్రస్టు బోర్డు సమావేశం

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో టీటీడీ ట్రస్టు బోర్డు సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు బోర్డు కార్యవర్గ సభ్యులు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ బోర్డు ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి ట్రస్టు బోర్డు సభ్యులు, దాతలు, భక్తులంతా హాజరు కావాలని కోరారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పాలకొండ: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ ఎం. రాంబాబు అన్నారున. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పండగ సెలవులకు స్వగ్రామాలకు వెళ్లిన వారు విధిగా పోలీసులకు సమాచారం ఇస్తే.. దొంగతనాలు జరగకుండా నిఘా పెడతామని చెప్పారు. ఎక్కడా దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పండగ సందర్భంగా కోడి పందాలు, పేకాటలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్ సీపీ కమిటీలో ఆర్గనైజేషన్ సెక్రటరీగా పదవి కట్టబెట్టడం పట్ల కురుపాం మండలంలోని మొండెంఖల్లుకు చెందిన రేవు సత్తిబాబు.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విషయమై శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ పదవి ఇచ్చిందని, అధిష్టానం కట్టుబాట్లకు బద్దుడనై పనిచేస్తానని, పార్టీ మరింత బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

హెల్మెట్ తప్పనిసరి ..



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఎస్సై వై.అమ్మన్నరావు అన్నారు. శనివారం స్థానిక వారపు సంత వద్ద వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. – సీతంపేట

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ ..



బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓలు పత్రి కృష్ణమూర్తి, కురిటి సోంబాబు శనివారం ఆవిష్కరించారు. బీటీఏ 25 ఏళ్లుగా ఎదుగుతూ, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు తండాడి అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గొల్ల ఉమామహేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు మజ్జి సోమేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ అలజంగి చిన్నారావు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్

19న ఆదివాసీ సమ్మేళనం..



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 19న జరగనున్న ఆదివాసీ సమ్మేళనానికి గిరిజనులంతా తరలిరావాలని గిరిజన ప్రజాసమాఖ్య ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మోహన్‌పాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతంపేటలో వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుందరరావు, రామస్వామి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

గరుగుబిల్లి: గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి పి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని పెదగుడబ పంచాయతీ, ఎస్‌ఆర్‌పేటను శనివారం సందర్శించిన ఆయన.. ప్రజలకు, వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలు, మహిళలు రక్తహీనత బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి సకాలంలో సరైన వైద్యం అందించాలన్నారు. గర్భిణులంతా ఐరన్, కాల్షియం మాత్రలను విధిగా తీసుకునేలా చూడాలన్నారు. చిన్నారులకు సమయానికి వేయాల్సిన వ్యాక్సిన్లు వేయాలన్నారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

ఆర్టీసీలో అదనపు సర్వీసులు

పార్వతీపురం టౌన్: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి చర్యలు చేపట్టామని పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు. శనివారం స్థానిక డిపోలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖపట్నానికి 40 సింగిల్ సర్వీసులు నడుస్తున్నాయన్నారు. పండగకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో 20 సింగిల్ సర్వీసులను డబుల్ సర్వీసులుగా మార్చడమే కాకుండా మరో 20 అదనపు సర్వీసులను ప్రారంభించామన్నారు. 24 గంటలు బస్సు సర్వీసులను ప్రతీ 15 నిమిషాలకు ఓ సర్వీసును ప్రారంభించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పూర్తి ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు.

గోకులాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



కురుపాంలో గోకులం షెడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలో నాలుగు చోట్ల నిర్మించిన గోకులాలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.2.30 లక్షల వ్యయంతో రెండు గోకులాలు, పూతివలస, తోటగూడల్లో రూ.1.15 లక్షల నిధులతో ఒక్కో గోకులం చొప్పున జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణాలు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరరావు, ఏపీవో బావాజీరావు తదితరులు పాల్గొన్నారు.

పండగ రోజుల్లో తస్మాత్..

పార్వతీపురం టౌన్: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పార్వతీపురం పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో ఇళ్లను ఖాళీ చేసి వేరే గ్రామాలకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురష్కరించుకొని అపరిచితులు సంచరించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా పండగను పురష్కరించుకొని ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే వారంతా పోలీసులకు సమాచారం అందిస్తే తమ దృష్టి ఆ ఇళ్లపై ఉంటుందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి పాతబస్టాండ్ వరకు రద్దీ దృష్ట్యా వాహనాలను అనుమతించడం లేదని వాహన చోదకులు గమనించి పోలీసు వారికి సహకరించాలని ఆయన కోరారు. వాహన చోదకులు రోడ్డు భద్రత పాటించాలని సూచించారు. ఎస్‌ఐ గోవింద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ మురళీధర్, ఎస్‌ఐ గోవింద్

ఘనంగా కూడారై ..



సాలూరు పట్టణంలోని పెదకోమటిపేట రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారై వెల్లం సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. – సాలూరు

ఏజెన్సీ మిరపకు భలే డిమాండ్

- మిర్చి ఏరివేతలో జాగ్రత్తలు మేలు..
- గ్రేడింగ్ పాటిస్తే మద్దతు ధర



పురుగు మందులు పిచికారీ చేయరాదు

మిరపపంట కోతకు 15 నుంచి 20 రోజల ముందు నుంచి ఎటువంటి పురుగు మందులు, రసాయనాలు పిచికారీ చేయరాదు. అలాగే కోతకు ముందు పంటకు నీడి తడులు ఇవ్వరాదు. మిరపకాయలను మొక్కమీదే ఎక్కువగా పండనిస్తే కాయలు ముడతలు పడి, సూర్యకాంతి వల్ల రంగు కోల్పోతుంది. మొక్క మీద పక్వానికి వచ్చిన కాయలను వాతావరణం వేడిగా ఉన్నప్పుడు మాత్రమే కోయాలి. సాధ్యమైనంత వరకు తెగుళ్లు, పురుగులు ఆశించిన పొళ్ల కాయలను కోత సమయంలో వేరు చేయాలి.

– కొర్ను సింహాచలం, మండల వ్యవసాయాధికారి, భామిని

భామిని: ఏజెన్సీలో పండే మిరపకాయలకు భలే గిరాకీ ఉంటుంది. గ్రేడింగ్ పాటించి మిరపకాయలను ఆరబెడితే మంచి గిట్టుబాటు ధర వస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పాలకొండ డివిజన్‌లోని భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో అధికంగా మిర్చి పంట సాగు చేస్తున్నారు. సీతంపేట మండలంలో కాస్తా తక్కువగా నీటివసతి ఉన్నచోట మాత్రమే సాగు చేపడుతున్నారు. అయితే ఏజెన్సీ నేలలు సారవంతం కావడంతో కాయలు మంచి సైజులో వస్తాయని రైతులు చెబుతున్నారు. పచ్చిగా ఉన్నప్పుడు చాలా పంట విక్రయించేస్తామని.. మిగిలినవి పండిన తర్వాత తీసి ఎండబెడతామని తెలిపారు. సంక్రాంతి సీజన్ కావడంతో మిర్చికి కాస్త డిమాండ్ ఉంది. అయితే వర్షాధార ప్రాంతంలో సాగు చేసేవారు మూడు నాలుగు కోతలు.. నీటి తడుల ఆధారంగా సాగు చేసేవారు ఆరు నుంచి ఎనిమిది కోతలు కోయడం మంచిదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించి వ్యవసాయాధికారులు పలు సూచనలు చేశారు.



విరగ్గాసిన మిరపకాయలు



కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కోసిన కాయలను కుప్పగా పోసి ఒక రోజంతా టార్పాలిన్‌తో కప్పి ఉంచాలి. ఇలా చేస్తే కాయలన్నీ ఒకేలా పండుతాయి.
- కాయలను కుప్పగా పోసి గ్రేడింగ్ చేయాలి. తెగులు సోకిన కాయలు, బూజు పట్టిన కాయలను గ్రేడింగ్ ద్వారా వేరుచేసి విడిగా ఆరబెట్టాలి. లేకపోతే మిగతా కాయలకు కూడా బూజు తెగులు వ్యాపించి తాలు కాయలుగా మారే ప్రమాదం ఉంది.
- కోత అనంతరం కాయలను పాలిథిన్ పట్టాలపై లేదా శుభ్రం చేసిన కాంక్రీట్ కళ్లాల మీద ఆరబెట్టాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక లేదా పేడ అలికిన కళ్లాలపై ఆరబెట్టరాదు.
- రాత్రి వేళ మంచు ఎక్కువగా పడుతోంది. అందుకే రాత్రిపూట కాయలను పట్టాలతో కప్పి, ఉదయం ఎండరాగానే తీసి వేయాలి.
- ఎండబెట్టే సమయంలో మిరపకాయలను పలుచగా పోసి రోజూ తిరగేస్తూ ఉండాలి. ఎందుకంటే కాయలు బాగా ఎండక పోతే రంగు, మెరుపు కోల్పోయే అవకాశం ఉంది. ఒక వేళ కాయలో తేమ ఎక్కువగా ఉంటే శిలీంద్రియాలు చేరి నాణ్యత చెడిపోయే అవకాశం ఉంది. అందుకే కాయల్లో తేమ 10 నుంచి 11 శాతం వరకు వచ్చేలా ఎండనివ్వాలి. ఈ జాగ్రత్తలు తీసుకొని కాయలను గ్రేడింగ్ చేస్తూ విక్రయాలు చేపట్టాలి.

సంక్రాంతి సంబరాలు

సాలూరు : సంక్రాంతి సంబరాలు పల్లెలు, పట్టణాల్లో సందడిగా జరుగుతున్నాయి. ముందస్తుగా భోగి మంటలు వేస్తున్నారు. మరోవైపు ముగ్గుల పోటీలతో మహిళలు అలరిస్తున్నారు. హరిదాసులు తమ నామకీర్తనలతో సంప్రదాయాలను పాటిస్తూ మేల్కొలుపుతున్నారు. పిల్లలు, పెద్దలు అందరూ పాల్గొంటూ సందడి చేస్తున్నారు.